క్లుప్తంగా

స్వచ్ఛభారత్‌పై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానికంగా రైల్వే ఉద్యోగుల పిల్లలకు ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజయవాడ రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ప్రారంభించారు. చిన్నారులను వివిధ కేటగిరీలుగా విభజించి స్వచ్ఛ భారత్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జోగారావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు బహుమతులు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రజలకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక కరణంగారి సెంటర్‌లో ఉన్న గీతం పాఠశాల విద్యార్థులు ఆదివారం క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. భానుగుడి సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రకృతిని కాపాడుకోవడంలో అంతా సమష్టిగా సాగాలన్నారు. అనంతరం 1,500 క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేసి, ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడడంతో కలిగే అనర్థాలను ప్రజలకు విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో గీతం పాఠశాల కరస్పాండెంట్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ సురభి శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదివారం పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఆ మేరకు గాంధీనగర్, పోర్టు ఏరియా, గాంధీ సెయింటనరీ, జగన్నాథపురం శివాలయం ప్రాంతాల్లోని ప్రతిపాదిత కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. అక్కడ సదుపాయాలు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతిరావు, ఎలక్షన్ డీటీ మురళీకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ నాగశాస్త్రులు తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉత్తమ భవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై స్వామినాయుడు

కొత్తపల్లి: విద్యతోనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్సై స్వామినాయుడు అన్నారు. ఉప్పాడలో ఆదివారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మహిళల భద్రత, పోలీసుల విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ వారధి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. మహిళలకు రక్షణ కోసం ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా 'తెల్లబంగారం'

తుని రూరల్: మెట్ట ప్రాంత రైతుల తెల్లబంగారంగా భావించే పత్తిచేలు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలించడం, అధిక వర్షాలు లేకపోవడంతో ఆరుతడిగా సాగయ్యే పత్తిచేలు పూత, పిందెలు, కాయలు విరబూసి కళకళలాడుతున్నాయి. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం తగ్గడంతో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో 2394 మంది రైతులు 2426 ఎకరాల్లో ఖరీఫ్‌లో పత్తి వేశారు. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధి ఐదు మండలాల్లో 1050 రైతులు 979 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా తుని మండలంలో 795 మంది రైతులు 734 ఎకరాలు, తొండంగి మండలంలో 49 మంది రైతులు 46 ఎకరాలు, కోటనందూరు మండలంలో ఒక రైతు మూడు ఎకరాలు, రౌతులపూడి మండలంలో 159 మంది రైతులు 131 ఎకరాలు, శంఖవరం మండలంలో 49 మంది రైతులు 65 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు.

జై గణేశ... శరణు విఘ్నేశ

- ప్రకృతికి మట్టి ప్రతిమలే మేలు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పంపిణీ
- పంచారామ క్షేత్రంలో 9 రోజుల పాటు హోమాలు



సామర్లకోటలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ సీతారామారావు, ట్రాఫిక్ ఎస్సైలు

సామర్లకోట: విఘ్నేశ్వరుని పూజకు సర్వం సిద్ధమైంది.. ఆ స్వామిని మనసారా కొలిచే వినాయక చవితి వేడుకను సోమవారం అంగరంగ వైభవంగా జరుపుకొనేందుకు ఊరూవాడా ఉత్సుకతతో చూపుతోంది.. ప్రకృతికి ప్రణమిల్లేలా మట్టి గణపయ్యను పూజించాలనే నినాదం అందరి నోటా వినిపిస్తోంది.. వినాయక చవితిని పురస్కరించుకొని పీబీ దేవంలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ జరిగింది. పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ముఖ్య అతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ పాల్గొన్నారు. పట్టణంలో అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి ప్రకృతిని కాలుష్యం బారినుంచి కాపాడదామని పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే నవరాత్ర ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశాయి. ఆయా మంటపాల వద్ద విద్యుత్తు దీపాలతో అలంకరణ ఆకట్టుకుంటోంది.

నేటి నుంచి ఉత్సవాలు

స్థానిక పంచారామ క్షేత్రంలోని గణపతి ఆలయంలో సోమవారం ఉదయం గణపతి నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. రోజూ ఆలయంలో హోమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. పట్టణ, మండల పరిధిలోని ప్రతి గణపతి ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయాల వద్ద రంగులు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఆటో, ట్యాక్సీ, లారీ స్టాండ్‌లతో పాటు ఆయా ముఖ్య కూడళ్లలో మంటపాలను ఏర్పాటు చేశారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో చిన్న పరిశ్రమల యాజమానులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు.



పిఠాపురం జైగణేష్ ఆలయంలో పాలవెల్లి తయారీకి పండ్లు, పత్రి సిద్ధం చేస్తున్న భక్తులు



కొత్తపల్లిలో ముస్తాబు చేసిన గణపతి ఆలయం

సిద్ధమైన గణపతి మందిరాలు

కొత్తపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు మండలంలో ఉన్న ఆలయాలు, మందిరాలు విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఇప్పటికే వినాయక విగ్రహాలను, ప్రతిమలను ఆలయ, ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో మందిరాలకు చేరాయి. పలు మండపాల వద్ద మట్టి గణపతిని పూజించేందుకు కళాకారులు, శిల్పిలతో విగ్రహాలను తయారు చేయించారు. ఆలయాల వద్ద ప్రతిరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీలు తెలిపాయి.

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్యా..!

చవితి ఉత్సవాలకు సిద్ధం

పిఠాపురం: ఓబొజ్జ గణపయ్య నీబంటు నేనయ్యా.. అంటూ భక్తులు వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వినాయక చవితి ఉత్సవాలకు అన్ని వినాయక ఆలయాలను భక్తులు సిద్ధం చేశారు. మరో పక్క గ్రామాల్లో ప్రతి వీధిలోను వినాయక మండపాలు సిద్ధమయ్యాయి. సోమవారం వినాయక చవితి సందర్భంగా ఆదివారం పిఠాపురం మార్కెట్ కొనుగోలుదారులతో నిండిపోయింది. పత్రిలు పండ్లు భక్తులు కొనుగోలు చేశారు. చిన్న విగ్రహాల నుంచి అతి భారీ విగ్రహాల అమ్మకాలు జరిగాయి. పలు చోట్ల మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు.

పిఠాపురంలో భారీ పాలవెల్లి తయారీ

పిఠాపురంలో ప్రసిద్ధి గాంచిన జై గణేష్ ఆలయంలో భారీ పాలవెల్లి తయారీకి భక్తులు పండ్లు, పత్రి సిద్ధం చేశారు. సుమారు లక్ష యాపిల్ పండ్లతో పాలవెల్లి తయారీ చేపట్టారు. ఏటా ఆలయం లోపల ఏర్పాటు చేసే పాలవెల్లిని ఈ ఏడాది ఆలయ వెలుపల మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు వినాయక దీక్షలు చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు నవరాత్ర ఉత్సవాలు పూర్తి చేసి పదో రోజు దీక్షలు విరమించనున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మట్టి గణపతి ప్రతిమలను మాత్రమే ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించుకోవచ్చు. ఈ మేరకు 15 ఏళ్లుగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జన సమయంలో నీటిలో మట్టి విగ్రహాలు కరిగిపోతాయి.

– తోటకూర గంగాధర్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, పీబీ దేవం

అనుమతి తప్పనిసరి



పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలి. రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా పదిహేనేళ్లుగా మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం అభినందనీయం. గణపతి మంటపాలు ఏర్పాటు చేసుకొనే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు.

– జె.సీతారామారావు, ఆర్డీఓ, పెద్దాపురం

గురువులపై భక్తిభావం కలిగి ఉండాలి



సభలో ప్రసంగిస్తున్న సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు తదితరులు

కాకినాడ కల్చరల్: గురువులపై భక్తిభావం కలిగి ఉండాలని సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా జగన్నాథ శర్మ కల్యాణ మండపంలో ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పోతన భాగవతంపై ఉపన్యాసం జరిగింది. భాగవతంలోని షష్టమ స్కంధం నుంచి అమృత తుల్యమైన పద్యాలను జోస్యుల రాగయుక్తంగా ఆలపించి వాటి భావాలను వివరించారు. గురువును నిర్లక్ష్యంగా చూస్తే ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నవాడైనా పతనమవుతాడని ఆయన తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సమితి అధ్యక్షుడు గొట్టిముక్కల వెంకట సత్యనరసింహశాస్త్రి మాట్లాడుతూ భాగవతం మనిషిని సంస్కారిగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుందన్నారు. సమితి ఉపాధ్యక్షులు కారుప్రోలు గౌరినాయుడు, మార్ని జానకీరామ్‌చౌదరి, డాక్టర్ పొన్నపల్లి శ్రీరామారావు, చింతపల్లి సుబ్బారావు, అనురాధ, సిరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కొండెవరంలో కోలాట ప్రదర్శన

కొత్తపల్లి: కొండెవరంలో ఉన్న పాటిమీద రామాలయం వద్ద ఆదివారం రాత్రి జరిగిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. రామాలయ భక్తి సంఘం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కళాకారులు నృత్యం ప్రదర్శించారు. వీరికి రాజమండ్రికి చెందిన సురేష్‌బాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ గాది గంగబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకారులకు, చేతి వృత్తిదారులకు బంగారు వర్తకులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వారికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాను అండగా నిలబడతానని ఆయన అన్నారు. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారిక పండగగా జరుపుకోవాలని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ నేత గండేపల్లి బాబీ, విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు కట్టోజు రాజారావు, వరదా వీరభద్రరావు, మారోజు వీరబాబు, వీరమల్లు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

సాగర తీరం.. ఆనందాల హోరం..



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ, కొనపాపపేట సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతోపాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో ఉప్పాడ సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మ లోవ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకొని సంతోషంగా గడిపారు.

మినీ వ్యాన్ బోల్తా

ఇద్దరికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలు

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని బాపనమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తుల మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి స్వల్పంగా, ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన 20 మంది వ్యాన్‌లో ఆదివారం సీతపల్లిలోని బాపనమ్మ గుడికి వచ్చారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం రంప జలపాతం చూసేందుకు మినీ వ్యాన్‌లో బయలుదేరారు. ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జింకల శివ, పురందాసు కొండయ్యకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. మిలిగినవారు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందారు.

చేయూత అందించేందుకు చర్యలు

నాగమల్లితోట జంక్షన్: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా శాఖ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల పర్యటనకు పయనమైందని ఆ శాఖ అధ్యక్షుడు రిక్కీ గూటం ఆదివారం తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల్లో మందులు, గ్రోసరీ, సోలార్ ల్యాంప్స్, ఆహార పదార్థాలు యుద్ధం వల్ల నష్టపోయిన ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాల్లో ఈ సేవలు అందిస్తామన్నారు. నాగాలాండ్, మణిపూర్ వెళుతున్న బృందంలో రిక్కీ గూటంతో పాటు స్టీవెన్ ఆనంద్, మోజెస్ బెన్నీ, సుధీర్, పాల్ రాజ్ కమల్, అంకిత్‌రెడ్డి ఉన్నారు.

కుల మతాలకు అతీతంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పూజలు చేస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: కుల, మతాలకు అతీతంగా విశ్వకర్మ జయంతిని ఏటా జరుపుకోవడం ఆనందదాయకమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌లతో కలసి పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతా సర్వమత సామరస్యాన్ని పాటిస్తూ ఐకమత్యంగా జీవించాలన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ జయంతి ఉత్సవాలను దొరబాబు ప్రారంభించారు. కౌన్సిలర్లు కట్టా రాజబాబు, విడదాసరి రాజా, చింతా శ్రీనివాసరావు, పండు, చిట్టిమోజు శ్రీను, వేముల అర్జునరావు, చిట్టిమోజు లక్ష్మీనారాయణ, బంగారు సత్యనారాయణ, చిప్పాడ బుజ్జి, దవలేశ్వరపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం



ఆస్పత్రిలో పండ్లు అందజేస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఆదివారం పిఠాపురంలో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ నేతలు పసుపులేటి సత్యనారాయణ, గండి కొండలరావు, అల్లుబోయిన సూరిబాబు, కర్నీడి తాతీలు, ఏలూరు సూర్యనారాయణ, ఎడ్ల భాస్కరరావు తదితరులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా రూ.13వేల కోట్లు చేతి వృత్తిదారులకు అందజేయడం హర్షించదగ్గ విషయమని బీజేపీ నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో రాయుడు కుమారి, సోమరౌతు జ్యోతి, కరణం గంగా భవానీ, మోహన్‌రావు, అవసరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాభివందనం



బోర్డుపై మోదీ చిత్రాన్ని వేస్తున్న మహాలక్ష్మి

పెద్దాపురం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దాపురం పట్టణానికి చెందిన కోరుకొండ మహాలక్ష్మి గీసిన చిత్రం ఆకట్టుకుంటోంది. చిన్న వస్తువులపై ప్రముఖుల చిత్రాలను గీయడం అంటే ఆమెకు ఆసక్తి. గతంలో జాతిపిత మహాత్మా గాంధీ చిత్రాన్ని సుద్దముక్కపై తీర్చిదిద్ది ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ప్రధాని మోదీ చిత్రాన్ని గీసి అందరి మన్ననలు పొందుతున్నారు.

శెట్టిబలిజలకు అండగా ప్రభుత్వం

కాకినాడ సిటీ: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం శెట్టిబలిజ సామాజిక వర్గానికి అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. పితాని శ్రీనివాసరావు ఫోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయి సందర్భంగా కాకినాడ సూర్యకళా మందిరంలో నిర్వహించిన సిటీ శెట్టిబలిజ కుటుంబాల ఆత్మీయ సమ్మేళన సభలో వారు పాల్గొని మాట్లాడారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తాను ఇదే సామాజిక వర్గం నుంచి రాజకీయ రంగంలో అడుగుపెట్టానని తనను, తన సామాజిక వర్గాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తించి అప్పట్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవితో పాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. ఈ ఎంపికలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన పాత్ర పోషించారని మంత్రి వేణు వివరించారు. నాటి నుంచి ద్వారంపూడితో స్నేహం కొనసాగుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ సామాజిక వర్గీయులు బలపరిచిన పార్టీలే విజయం సాధించడంలో ప్రధాన పాత్ర వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ శెట్టిబలిజలు డబ్బులు ఆశించరని, గౌరవాన్ని మాత్రమే కోరుకుంటారన్నారు. పితాని శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో తన ఒంటిపై నల్లకోటు వేసుకుని తిరగడాన్ని గ్రహించానని, అందుకే ఆయనకు సముచిత స్థానం కల్పించాలని ఆనాడే నిర్ణయించుకున్నానన్నారు. అనుకోకుండా పితాని శ్రీనివాసరావుకు ఫోక్సో కోర్టు స్పెషల్ పీపీగా అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. ఫోక్సో కోర్టు పీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతుందన్నందున శెట్టిబలిజ కులస్తులు పితాని శ్రీనివాసరావును సత్కరించారు. అనంతరం పితాని ఆధ్వర్యంలో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను శెట్టిబలిజ కులస్తులు, పెద్దలు, నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, శెట్టిబలిజ సామాజిక వర్గ నేతలు వాసంశెట్టి రాజేశ్వరరావు, మట్రిపూడి రమణ, వాసంశెట్టి సత్య, కందూరు అప్పలనాయుడు, గీసాల భాస్కర్, పితాని సోమన్న, రాయుడు మురళి, బొందల నూకరాజు, కర్రి బాబ్జీ, వాసంశెట్టి భీమరాజు, నురుకుర్తి సూర్యప్రకాశ్, ఎల్లబోయిన చిన్న, దొడ్డి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి బాటలు పడ్డాయని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో వలసపాకల పరిధి సుందరయ్య కాలనీలోని ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వలసపాకల సుందరయ్య కాలనీ నుంచి పెద్దలంతా వైఎస్సార్ సీపీలో చేరడం అభినందనీయమన్నారు. సుందరయ్య కాలనీ వాసులను అక్కడి నుంచి తరలించాలని చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో సుందరయ్య కాలనీపై ఉన్న కేసులు తొలగించి మొత్తం అందరినీ ఒప్పించి బ్రహ్మాండమైన కాలనీ నిర్మించామన్నారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. కాలనీ వాసులంతా దినసరి కూలీలని ఫ్యాక్టరీలు, ఇతర చోట్ల పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. వీరందరికీ అండగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వామపక్షాలకు చెందిన వారు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుపై నమ్మకంతో ఆయన అడుగు జాడల్లో నడిచేందుకు వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, రమణయ్యపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, గగారిన్, వాకలపూడి సుబ్బారావు పాల్గొన్నారు.